## సాయంత్రం వేళల్లో 'ఉపాధి' కల్పించాలి


పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీధర్

**శంకరపట్నం:** ఉపాధిహామీ పథకంలో ఉదయం పని చేయడానికి అవకాశం లేని కూలీలకు సాయంత్రం వేళల్లో కల్పించాలని డీఆర్‌డీవో శ్రీధర్ సూచించారు. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు సాయికుంటలో చేస్తున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. కూలీలకు తాగునీటి వసతి కల్పించాలని పంచాయతీ కార్యదర్శి స్వప్నను ఆదేశించారు. రెండు రోజులుగా తాగునీరు అందుబాటులో ఉంచుతున్నారని కూలీలు డీఆర్‌డీవోకు తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా వైద్య సిబ్బంది తీసుకువచ్చిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో శారద, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం తొలగింపు


షెడ్డును కూల్చివేస్తున్న జేసీబీ

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధిలోని మారుతీనగర్‌లో సర్వే నంబర్ 887 ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్డును మున్సిపల్ అధికారులు శనివారం తొలగించారు. కమిషనర్ ఆయాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో టీఎస్ బీపాస్ ద్వారా కావాల్సిన డాక్యుమెంట్స్ సమర్పించి, అనుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వరుణ్, టీపీఎస్ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## చొప్పదండిలో బీఆర్‌ఎస్ రైతు దీక్ష


దీక్షలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు

**చొప్పదండి:** పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం రైతు దీక్ష నిర్వహించారు. అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, గడ్డం చుక్కారెడ్డి, బాలగౌడ్, కొత్త గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గన్నేరువరం: సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు


తిమ్మాపూర్ మండలం నుంచి..

# తుక్కుగూడ తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

**తిమ్మాపూర్:** తుక్కుగూడ కాంగ్రెస్ సభకు శనివారం తిమ్మాపూర్ మండలం నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. మండల శాఖ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తిరుపతిరెడ్డి, రమేశ్, నాయకులు రాము, రాజిరెడ్డి, అనిల్, కొండల్‌రావు తదితరులున్నారు.

**గన్నేరువరం:** కాంగ్రెస్ జనజాతర సభకు ఆ పార్టీ గన్నేరువర మండల నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్లారు. మండల శాఖ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి బొడ్డు సునీల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, నాయకులు ముడికే అజయ్, మల్లయ్యగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, పర్శరాం తదితరులున్నారు.

**జమ్మికుంట:** తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ నిర్వహించిన సభకు ఆ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండల నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో వీరవేని పర్శరాంరావు, పర్లపల్లి నాగరాజు, రాచపల్లి సమ్మయ్య, సలిగంటి సతీశ్, రాచపల్లి సాగర్, శ్రీనివాస్, నాగినేని రాజేశ్వర్‌రావు, తాళ్ల శ్రవణ్, కరట్లపల్లి శ్రీనివాస్, ఎరబాటి రమేశ్, దొగ్గల భాస్కర్, రాచపల్లి శేఖర్ తదితరులున్నారు.

**ఇల్లందకుంట:** మండలంలోని 18 గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో తుక్కుగూడ సభకు తరలివెళ్లారు. నాయకులు గూడెపు సారంగపాణి, వంగ రామకృష్ణ తదితరులున్నారు.

**సైదాపూర్:** తుక్కుగూడ సభకు శనివారం సైదాపూర్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బస్సుల్లో వెళ్లారు.


జమ్మికుంట నాయకులు..


ఇల్లందకుంట మండల నాయకులు..

# దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి
- జిల్లాలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


హుజూరాబాద్‌లో జెండా ఎగురవేసిన కృష్ణారెడ్డి, నాయకులు

**హుజూరాబాద్‌రూరల్:** దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హుజూరాబాద్ పట్టణంలో జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. రెండు సీట్లతో ప్రారంభమై నేడు వరుసగా రెండు పర్యాయాలు కేంద్రంలో అధికారంలో ఉండే స్థాయికి ఎదిగిందని తెలిపారు. ముచ్చటగా మూడోసారి 400 సీట్లు కైవసం చేసుకొని, కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే, పట్టణంలోని 49, 50, 51 52వ బూత్ శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు తూర్పాటి రాజు, యంసాని శశిధర్ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లెపెల్లి రేణుక, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బొరగాల సారయ్య, నాయకులున్నారు.

**జమ్మికుంట:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు జీడి మల్లేశ్ ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగురవేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్ మాట్లాడారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనా విధానాలకు అనుకూలంగా బీజేపీ ఆవిర్భవించిందని తెలిపారు. వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ వంటి నేతలు పార్టీ పరిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. దేశానికి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని బలపరచాలని కోరారు. అనంతరం బీజేపీ టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, పల్లప రవి, ఠాగూర్ రాజేశ్, కోరె రవీందర్, ఇటుకాల స్వరూప, తూడి రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జమ్మికుంట: జెండా ఆవిష్కరించిన నాయకులు


దేశరాజ్‌పల్లిలో జెండా ఎగురవేసిన నాయకులు

**రామడుగు:** మండలంలోని దేశరాజ్‌పల్లి, రంగసాయిపల్లి గ్రామాల్లో శనివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, నాయకులు కట్ట రవీందర్, జిట్టా రాజు, ఐలయ్య, రమేశ్, మీసాల సునీల్, సురేశ్, శ్రీనివాసాచారి, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.


కనగర్తి గ్రామంలో..

**ఇల్లందకుంట:** బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఇల్లందకుంట మండలంలోని కనగర్తి గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు మట్ట పవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. నాయకులు బాల్‌రెడ్డి, రాజు, ఓంకార్, సుధాకర్‌రెడ్డి, కిరణ్, సంపత్, మల్లయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 'రైతులు కేసీఆర్‌ను నమ్మే పరిస్థితిలో లేరు'

**వీణవంక:** కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లేలా మాట్లాడటం సరికాదని ఆ పార్టీ వీణవంక మండల సీనియర్ నాయకుడు నల్ల కొండాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల కోసం ఆహర్నిశలు కృషి చేస్తున్నారని, గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు కేసీఆర్‌ను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోలేదని, కేవలం ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీ కనుమరుగవుతుందని తెలిపారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### నేటి బీఆర్‌ఎస్ యుద్ధభేరి సమావేశానికి రండి

**హుజూరాబాద్‌రూరల్:** జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ కరీంనగర్ పార్లమెంట్ యుద్ధభేరి సన్నాహక సమావేశానికి తరలిరావాలని ఆ పార్టీ జిల్లా నాయకులు మేకల రవీందర్, బోనగిరి ప్రభాకర్ కోరారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

### ముందస్తు అడ్మిషన్లపై చర్య తీసుకోవాలి

**జమ్మికుంట:** జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటూ ఫీజులు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారులు స్పందించి, చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేసవి తరగతులు నిర్వహిస్తున్న కళాశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు.

### కొత్తగట్టులో పోలీసుల కవాతు

**శంకరపట్నం:** కొత్తగట్టు గ్రామంలో శనివారం రాత్రి సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణం జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై లక్ష్మారెడ్డి కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# ఇచ్చిన హామీలను మరిచిన సీఎం

- రైతుల పక్షాన పోరాడుతాం
- ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్


ఎండిన వరిని పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు

**మానకొండూర్:** కాంగ్రెస్ అధికారం చేపట్టాక రైతులు ఆగమయ్యారని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు నివాసంలో శనివారం రైతు నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే చివరి తడి అందక పంటలు ఎండిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం ఇప్పుడెందుకు నోరుమెదపడం లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ అసమర్థత కారణంగానే ప్రాజెక్టుల్లో నీళ్లు లేవని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు సిద్ధం వేణు, తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, నాయకులు గడ్డం నాగరాజు, లింగాల లక్ష్మణ్, మహిపాల్‌రెడ్డి, గంప వెంకన్న గంట మహిపాల్, దేవేందర్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలి




పారువెల్లలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, రామడుగు: నోడల్ అధికారి అక్బర్..

**గన్నేరువరం:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో చీమలకుంటపల్లె, గునుకులకొండాపూర్, పీచుపల్లి, పారువెల్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఏవో కిరణ్మయితో కలిసి ప్రారంభించారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు ఇక్కడే ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ నిర్వాహకుడు అటికం తిరుపతిగౌడ్, హమాలీలు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రామడుగు:** మండలంలోని రామడుగు సహకార సంఘం పరిధి వెదిర, కిష్టాపూర్, షానగర్, కోరటపల్లి, తిర్మలాపూర్, సర్వారెడ్డిపల్లి, ముప్పిడిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నోడల్ అధికారి మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ శనివారం ప్రారంభించారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వరి


మాట్లాడుతున్న ఏఈ తిరుపతి

**రామడుగు:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్లో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వరి మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించి, పనులు నిర్వహించాలని సూచించారు. ఎంఈవో వేణుకుమార్, ఏఈ సచిన్, ఏపీఎం ప్రభాకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**శంకరపట్నం:** మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వహణపై ఏఈ తిరుపతి శనివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం గ్రామైక్య సంఘాల భాగస్వామ్యంతో నిధులు మంజూరు చేస్తోందన్నారు. వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. మండల విద్యాధికారి వెంకటనర్సింహారెడ్డి, ఎంపీవో బషీరుద్దీన్, ఏపీఎం సుధాకర్, సూపరింటెండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**మానకొండూర్:** చెంజర్ల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేశ్ తెలిపారు. ఈదులగట్టెపల్లి, పెద్దూర్‌పల్లి, ఖాదర్‌గూడెం, చెంజర్లకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.


### నేడు మల్లన్న కల్యాణం

**చొప్పదండి:** పట్టణ శివారులోని గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్వామివారి కల్యాణం, అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

### గద్దపాకలో మద్యం పట్టివేత

**శంకరపట్నం:** గద్దపాకకు చెందిన చిత్తారి కిరణ్ బెల్ట్‌షాపులో శనివారం రూ.3,970 విలువైన మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. వాటిని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ


బాధితులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

**హుజూరాబాద్:** బోర్నపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి టిప్పర్ బోల్తా పడిన ఘటనలో మృతిచెందినవారి కుటుంబాలను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదానికి కారకులపై తక్షణమే కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులున్నారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ మృతుల కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

# అవసరమైతే కెనాల్ గేట్లు బద్దలు కొడతా

- నీళ్లిచ్చేదాకా సీఎం రేవంత్‌రెడ్డిని వదలేది లేదు
- రైతు దీక్షలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

**హుజూరాబాద్:** పంటలకు మరో తడి నీళ్లిచ్చేదాకా సీఎం రేవంత్ రెడ్డిని వదిలిపెట్టేది లేదని, రైతుల కోసం అవసరమైతే కెనాల్ గేట్లు బద్దలు కొడతానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో చేపట్టిన ఒక్కరోజు రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని రైతులందరూ నీటి కోసం గోస పడుతున్నారని తెలిపారు. కమలాపూర్, ఇల్లంతకుంట, జమ్మికుంట మండలాల్లోని చాలా గ్రామాల్లో పంటలు ఎండే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క ఎకరం కూడా ఎందుకు ఎండ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు. రైతుల కోసం కేసీఆర్ కష్టపడుతూ పొలాల వెంట తిరుగుతుంటే సీఎం మాత్రం సరదాగా ఐపీఎల్ మ్యాచ్ వీక్షించడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ఇన్ని రోజులు కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం మీద పడి ఏడ్చారని, కేసీఆర్ బయటకి రాగానే కాళేశ్వరం నుంచి నీళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. రైతుల పక్షాన దండం పెట్టి అడుగుతున్నా.. ఇంకో తడికి అవసరమైన నీరు వెంటనే అందించాలని కోరారు. టూరిజం డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, శ్రీనివాస్, జమ్మికుంట చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కేడీసీసీబీ వైస్ చెర్మన్ పింగిళి రమేశ్, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సింగిల్ విండో చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

## ఆశవర్కర్ కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న రమేశ్

**తిమ్మాపూర్:** నేదునూరులో ఇటీవల వడదెబ్బతో మృతిచెందిన ఆశవర్కర్ కవ్వంపల్లి రాజేశ్వరి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, నుస్తులాపూర్ మాజీ ఉపసర్పంచ్ రావుల రమేశ్ శనివారం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. నుస్తులాపూర్ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొమురయ్య, నాయకులున్నారు.

## కబడ్డీ రన్నరప్ 'శ్రీచైతన్య'


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

**తిమ్మాపూర్:** జేఎన్‌టీయూ యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో కరీంనగర్ శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. వరంగల్‌లోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి అందుకున్నారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, క్రీడల్లో పాల్గొనటం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు చదువుపై కూడా ఆసక్తి పెంపొందించుకోగలుగుతారని పేర్కొన్నారు. సమావేశంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామనరసింహారెడ్డి, ఏవో రామారావు, మీడియా ఇంచార్జ్ గొంటి రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ సునీత, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899